క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ సమావేశం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశానికి విధిగా కౌన్సిల్ సభ్యులు, వివిధ శాఖాధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు.

యువత శాస్త్రీయ భావజాలం పెంపొందించుకోవాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

ముమ్మిడివరం: యువత, విద్యార్థులు శాస్త్రీయ భావజాలం పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మానవుడే మహనీయుడు పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రచారోద్యమంలో భాగంగా గురువారం స్థానిక రవీంద్ర హైస్కూల్లో జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత సమాజ నిర్మాణానికి ఉత్తమ భావాలను అలవరచుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఎల్ శ్రీనివాస్, ఎస్.అబ్బులు, రామ్‌ప్రసాద్, రామాంజనేయులు, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నానిరాజుకు మంత్రి విశ్వరూప్ పరామర్శ


నానిరాజును పరామర్శిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: సోదరుడి వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పరామర్శించారు. పట్టణంలోని నానిరాజు ఇంటికి మంత్రి విశ్వరూప్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి ఓదార్చారు. నానిరాజు సోదరుడు సీతారామరాజు చిత్రపటానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, సంసాని బులినాని, గుంటూరు బాలరాజు, రుద్రరాజు దత్తుడురాజు తదితరులు నానిరాజును పరామర్శించారు.

శిథిల పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్సీ


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు వై.జంక్షన్ వద్ద శిథిల స్థితిలో ఉన్న మండల పరిషత్ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు బుధవారం పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల శిథిలావస్థపై ఎమ్మెల్సీకు వినతి పత్రం అందించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకెళ్లి నాడు–నేడు ద్వారా అభివృద్ధికి కృషి చేస్తానని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే ఎమ్మెల్సీ సూచనల మేరకు ఆ పాఠశాలను డీఈవో ఎం.కమల కుమారి పరిశీలించారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్ తదితరులున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం: అల్పపీడన ప్రభావంతో రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. నగర పంచాయతీ కౌన్సిల్ హాలులో కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు అధికంగా ఉన్నందున ప్రజలు వేడి నీటిని తాగాలని సూచించారు. నగర పంచాయతీ సిబ్బంది నీరు నిలిచిపోకుండా డ్రైయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వాటర్ ట్యాంకర్లలో క్లోరినేషన్ చేయాలని సూచించారు. కమిషనర్ లోవరాజు మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

6న పదోన్నతికి శాఖాపర పరీక్ష

యానాం: ప్రభుత్వ శాఖల్లో యూడీసీలుగా పనిచేస్తున్నవారికి అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడానికి ఆగస్టు 6న డిపార్ట్‌మెంటల్ టెస్టును నిర్వహిస్తున్నట్లు డీపీఏఆర్ రిఫామ్స్ వింగ్ కార్యదర్శి వి.జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ పేపర్–1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పేపర్–2 నిర్వహించనున్నామన్నారు. పరీక్షకు సంబంధించి సిలబస్‌ను వెబ్‌సైట్‌లో పెట్టామని, యానాం అభ్యర్థులకు ఆర్ఏఓ ఆఫీసులో హాల్ టికెట్లను విడుదల చేస్తారని తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా

- 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా
- ఆగస్టు 21 వరకూ పున:పరిశీలన

ముమ్మిడివరం: టీడీపీ హయాంలో అడ్డగోలుగా తయారుచేసిన ఓటరు జాబితాపై రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలన చేపట్టింది. నకిలీ ఓటర్లను ఏరివేసి పారదర్శకమైన జాబితా మాత్రమే అందుబాటులో ఉంచేందుకు కసరత్తులు ముమ్మరం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఒకే ఇంటి నెంబరుపై పదుల సంఖ్యలో ఓట్లు, డోర్ నెంబర్లు లేనివి.. ఇలా అన్ని అంశాలపై పక్కాగా చేపట్టే సర్వే ప్రక్రియ ఈ నెల 1 నుంచి నియోజకవర్గాల్లో అట్టహాసంగా ప్రారంభమైంది. గత ప్రభుత్వ హయాంలో ఓటర్ల జాబితాల్లోకి ఇష్టారాజ్యంగా బయట వ్యక్తుల పేర్లు చేర్చారంటూ అప్పట్లోనే చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఒకే ఇంటి నెంబర్‌పై వందలాది ఓట్లు నమోదు చేయడం, మరికొన్ని ఓట్లకు డోర్ నెంబర్లే లేకపోవడం లాంటి అప్పటి అవకతవకలు ప్రస్తుత సర్వేలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

ముమ్మిడివరం నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో మొత్తం 2,34,710 మంది ఓటర్లున్నారు. వారిలో 1,17,546 మంది పురుషులు కాగా, మరో 1,17,164 మంది మహిళలున్నారు. తాజాగా చేపట్టిన సర్వేలో ఒకే డోర్ నెంబర్‌పై ఉన్న ఓట్లెన్ని..?, డోర్ నెంబర్ లేని ఓట్లెన్ని..?, పదికి పైగా ఉండే ఓటర్ల వివరాలు..?, ఫొటోలు సరిగా లేనివి..? గుర్తించే ప్రక్రియ మొదలైంది. క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు. సర్వే సాగుతున్న విధానంపై మండలాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు.


ముమ్మిడివరం మండలంలో జరుగుతున్న సర్వే ప్రక్రియ

నియోజక వర్గంలో ఓటర్ల వివరాలు..

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
ముమ్మిడివరం	61	27122	27455	54517
కాట్రేనికోన	70	31048	30530	61578
ఐ.పోలవరం	62	27282	27112	54394
తాళ్లరేవు	75	32094	32067	54161
మొత్తం	268	1,17,546	1,17,164	2,34,710

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి డోర్ నంబరులో ఎన్ని ఓట్లున్నాయి, వారు ఎక్కడెక్కడ నివాసముంటున్నారు అనే విషయాలు స్పష్టంగా తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే చేపట్టాం. ఆగస్టు 21 వరకూ బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తారు. పొరబాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిస్తాం.
– సీహెచ్ విజయశ్రీ, తహసీల్దార్, ముమ్మిడివరం

ఇంటింటికీ బీఎల్‌ఓలు

బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి మార్పులు, చేర్పులను గుర్తించి తప్పులు ఉంటే సెల్‌ఫోన్‌లో నమోదుచేస్తున్నారు. జులై 1న ప్రారంభమైన సర్వే ఆగస్టు 21 వరకూ కొనసాగుతుంది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబరు 29 వరకూ పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడతారు. అక్టోబర్ 17 నుంచి నవంబరు 30 వరకూ ఓటర్ల చేర్పులు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 26 లోపు చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఇతర క్లైయిమ్‌లు పరిష్కరిస్తారు. 2024 జనవరి 1న జాబితాల తుది పరిశీలన నిర్వహిస్తారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

ముంపునకు గురవుతున్న నారుమడులు


దేవగుప్తంలో భారీ వర్షాలకు నీట మునిగిన నారుమడి

అల్లవరం: బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని నారుమడులు ముంపు బారిన పడుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలకు తోడు కాలువలు, మురుగు కాల్వల్లో ముంపు నీరు స్తంభించడంతో వందలాది ఎకరాల్లోని నారు నీట మునుగుతుంది. పల్లపు ప్రాంతాలైన దేవగుప్తం, రెల్లుగడ్డ, మొగళ్ళమూరు, అల్లవరం, డి.రావులపాలెం గ్రామాల్లో నారుమడులు పీకల్లోతు ముంపులో ఉన్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నారుమడులు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రామేశ్వరం మొగ మూసుకుపోవడంతో ముంపునీరు దిగే దారి లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొగని తవ్వాలని కోరుతున్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి


మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద శాంతించిన గోదావరి


గుత్తినదీవి–గోగుల్లంక రేవు వద్ద పడవలో ప్రయాణిస్తున్న స్థానికులు

ఊపిరి పీల్చుకుంటున్న లంక ప్రాంత ప్రజలు

ఐ.పోలవరం: మండలంలోని వృద్ధ గౌతమీ గోదావరి వరద శాంతించడంతో లంక ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకొంటున్నారు. కేశనకుర్రు పంచాయతీ పరిధి పాగాకులంక, పల్లెగూడెం, పాతయింజరం, మురమళ్ల, గుత్తినదీవి, పశువుల్లంక, జి.మూలపొలం తదితర లంక ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. అన్నంపల్లి అక్విడెక్టు, మురమళ్ల రాఘవేంద్ర వారధి, యానాం–ఎదుర్లంక వారధి వద్ద గోదావరి నిలకడగా సాగుతుంది. గోగుల్లంక–గుత్తినదీవి రేవులో అత్యవసర ప్రయాణికులు లైఫ్ జాకెట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖాధికారులు సహాయక కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

మణిపూర్ ఘటనలను నిరసిస్తూ శాంతి ర్యాలీ

తాళ్లరేవు: మణిపూర్‌లో జరుగుతున్న అమానుష ఘటనలను నిరసిస్తూ తాళ్లరేవు, యానాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంతపేట సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ జోరువానలోనూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ మాట్లాడుతూ మణిపూర్‌లో వివిధ తెగల మధ్య ప్రారంభమైన ఘర్షణలు అనేక అకృత్యాలకు దారి తీశాయన్నారు. దాడుల్లో 250కి పైగా ప్రార్థన మందిరాలను ధ్వంసం చేయడం దారుణమన్నారు. అనంతరం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డి.సాల్మన్‌రాజు, బి.జార్జిముల్లర్, ఉంగరాల వెంకటేశ్వరరావు, పి.జాన్ విక్టర్, కె.జయానంద కుమార్, డి.పురుషోత్తం, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనపై పోలీసులకు వినతి

ఉప్పలగుప్తం: మణిపూర్ రాష్ట్రంలో దళిత ఆదివాసులపై జరిగిన ఘటనలను నిరసిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వీరబాబు, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావులకు మండల మాల మహానాడు నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రధాని మోదీ పరిపాలనలో దళితులపై, క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని, అటువంటి దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మాల మహానాడు కన్వీనర్ కొంకి వెంకట బాబ్జీ, బాలకృష్ణ, భగవాన్‌దాస్, పెయ్యిల కొండబాబు, సాధనాల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

ఐ.పోలవరం: మణిపూర్‌లో జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోదీ పూనుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తక్షణం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ కార్యదర్శి టి.నాగలక్ష్మి, నిమ్మకాయల వెంకటేష్, తోట గంగారత్నం, కె.నాగలక్ష్మి, జి.గంగాభవాని, ఏవీ రత్నం, పి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో మణిపూర్ ఘటనలను నిరసిస్తూ నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ


ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

ఉప్పలగుప్తం: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి పోతురాజు గుడి వీధిలో నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతాన్ని ఎంపీడీవో గౌరీకుమారి, పీఆర్ ఏఈ రాధాకృష్ణ బుధవారం పరిశీలించారు. తమ నివాసాల ముంగిట ఉన్న రహదారిపై వర్షం కురిసినప్పుడల్లా నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, ప్రధానంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి నానాపాట్లు పడుతున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయంపై గతంలో కార్యాలయానికి వచ్చి వినతి పత్రం సైతం అందించామని ఎంపీడీవో గౌరీకుమారికి వివరించారు. సమస్య నుంచి తమను బయట పడేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గౌరీకుమారి, ఏఈ రాధాకృష్ణ బదులిచ్చారు.


చల్లపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

పురందేశ్వరికి చేనేత రాట్నం బహూకరణ


పురందేశ్వరికి రాట్నం బహూకరిస్తున్న పద్మినీకుమార్

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన బీజేపీ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి ఇమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన బీజేపీ చేనేత సంఘం రాష్ట్ర నాయకుడు సోరపల్లి పద్మినీకుమార్ చేనేత రాట్నాన్ని బహూకరించారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ చేనేతల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికే సురక్ష

తాళ్లరేవు: సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం జి.వేమవరం పంచాయతీ సచివాలయం–2లో సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ సునీత మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు నూరు శాతం సంక్షేమం అందుతుందన్నారు. అనంతరం 350 మంది లబ్ధిదారులకు ఉచితంగా పలు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, మట్టా లింగమూర్తి, దెయ్యాల సత్తిబాబు, నీలపాల శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


జి.వేమవరంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

వార్డుల్లో సమస్యలపై పరిశీలన

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి బుధవారం స్వయంగా పరిశీలించారు. 30వ వార్డులో అధిక వర్షాల వల్ల డ్రెయిన్ సరిగా ప్రవహించక అసౌకర్యంగా మారిన పరిస్థితులను, 4వ వార్డు గండు వీధిలో వర్షాలకు ముంపునకు గురవుతున్న సీసీ రోడ్డును, 2వ వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనాన్ని వారు పరిశీలించారు. సమస్యలపై కౌన్సిల్‌లో చర్చించి పరిష్కారం దిశగా నిధులను దశల వారీగా మంజూరు చేస్తామన్నారు. కౌన్సిలర్లు యన్నాబత్తుల పద్మ, ఆశెట్టి నాగదుర్గ తదితరులు పర్యటనలో పాల్గొని తమ వార్డుల్లోని సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లారు.


అమలాపురం 30వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి తదితరులు

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ


అభిషేక్‌ను అభినందిస్తున్న చైర్మన్ వెంకటరమణ

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో యానాం డ్రీమ్స్ ఫౌండేషన్ హైస్కూల్ విద్యార్థి ఎస్.అభిషేక్ ప్రతిభ కనబరిచాడని చైర్మన్ శేరు వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి పుదుచ్చేరిలో జరుగుతున్న రాష్ట్ర సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో 50, 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం జేసీ మేత్యూ, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం రంగసామిని కలిసిన ఆక్వా రైతులు

యానాం: 1990 నుంచి ఆక్వా సాగుచేస్తున్న తమను ఆదుకోవాలని కోరుతూ యానాం నియోజకవర్గ పరిధిలోని ఆక్వా రైతులు బుధవారం పుదుచ్చేరిలో సీఎం రంగసామిని కలిసి వినతి పత్రం అందజేశారు. దాదాపు 33 ఏళ్లుగా ఆక్వా సాగు చేస్తున్నా ప్రభుత్వం నుంచి విద్యుత్ సబ్సిడీ, ప్రొడక్షన్ ఇన్సెంటివ్స్ లాంటి రాయితీలేవీ తమకు అందడం లేదని వాపోయారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకం ద్వారా వచ్చే రాయితీలను అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఇ.విష్ణువర్ధనరావు, కొండమూరి భాస్కరరావు, అనిశెట్టి నాగిరెడ్డి, మెల్లం శ్రీనివాసరావు, కవల వీరభద్రరావు, కోరుకొండ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టపరిహారం ఇవ్వాలి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో చమురు సంస్థలు మత్స్యకారులకు అందించే వేట నష్ట పరిహారంలో వివక్ష లేకుండా అర్హులందరికీ అందజేయాలని పుదుచ్చేరి ఎంపీ వైథిలింగం పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పుదుచ్చేరి నుంచి విలేకరులకు వీడియో విడుదల చేశారు. వేట పరిహారానికి అర్హులైన సుమారు 2 వేల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ తాను పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించినవారిని తక్షణం తిరిగి చేర్చాలన్నారు. ఈ సమస్యపై ఎల్జీ, హోంమంత్రితో మాట్లాడతానని పేర్కొన్నారు.


సీఎం రంగసామికి తమ సమస్యలను వివరిస్తున్న యానాం ఆక్వా రైతులు

విద్యారంగ అభివృద్ధికి దోహదం

యానాం: 2020లో దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం విద్యారంగ అభివృద్ధికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో నూతన విద్యావిధానం ప్రవేశపెట్టి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని దాని అమలు ద్వారా వచ్చిన విద్యా సంబంధిత మార్పులపై వివరించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో అభిరుచి, కౌశలం, నైపుణ్యాలకు తగిన విధంగా పెద్దపీటవేసి వారి సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. దీంట్లో భాగమైన నిపుణ భారత్, పీఎం విద్య, విద్యాంజలి వంటి పథకాల గురించి వివరించారు. పీఎం స్కూల్స్ ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో రూ.2,760 కోట్లు ఖర్చు చేయనుందన్నారు. హ్యాండి క్రాఫ్ట్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఐటీ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నవోదయ ప్రిన్సిపాల్ ప్రకాశరావు

పలివెల వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలి

అమలాపురం రూరల్: అమలాపురం–బొబ్బర్లంక రోడ్డులో కొత్తపేట మండలం పలివెల వద్ద ఉన్న జెడ్ బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉందని, రూ.4 కోట్లతో అలైన్‌మెంట్ మార్చి నూతన బ్రిడ్జి నిర్మించాలని బుధవారం ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు లేఖ రాశారు. అమలాపురం, రాజమండ్రి రెవెన్యూ డివిజన్లకు ప్రధాన అనుసంధానంగా ఉన్న ఈ వంతెనపై భారీ వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో వెంటనే నూతన బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

కారుణ్య నియామకాలు జరపాలి

అమలాపురం రూరల్: కోవిడ్–19తో రాష్ట్రంలో 2,917 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరణించారని, వారి పిల్లల్లో ఇప్పటివరకూ 1,488 మందికే కారుణ్య నియామకాలు ఇచ్చారని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. మిగిలిన 1,149 మందికి సచివాలయాల్లో కారుణ్య నియామకాలు ఇవ్వాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసిన నేపథ్యంలో వెంటనే ఖాళీలు నింపాలని కోరారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం రూరల్: ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. అమలాపురం డిపోలో డ్రైవింగ్ కళాశాలలో ఏడో బ్యాచ్‌గా 16 మంది విద్యార్థులకు గాను 32 రోజుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు డ్రైవింగ్‌లో మెళకువలు తెలియజేసి వారికి డ్రైవింగ్ మాన్యువల్ కరపత్రాలు అందించారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డిపోలో ప్రారంభించిన హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా డ్రైవింగ్ శిక్షణతో పాటు వెహికల్ మెయింటెనెన్స్‌కు సంబంధించి ప్రాథమిక శిక్షణ ఇస్తామన్నారు. ఎనిమిదో బ్యాచ్‌లో ప్రవేశం కోసం ఆసక్తి కలిగినవారు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రజాక్‌ను 73829 09588 ఫోన్ నెంబరులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీర్ జీఆర్ఎల్ దేవి, ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.


శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఎంవీఐ రవికుమార్, డీఎం మూర్తి తదితరులు

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

అమలాపురం రూరల్: బాలల అక్రమ రవాణాను అరికట్టడానికి చైల్డ్ రైట్స్ అండ్ యూ బెంగళూరు భాగస్వామ్య సంస్థ అయిన శ్రమ స్వచ్ఛంద సంస్థ కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ నెల 30వ తేదీన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి జీవీ సత్యవాణిల చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ బాలల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రమ ప్రాజెక్టు డైరెక్టర్ జె.శేషగిరిరావు, కోఆర్డినేటర్ బి.నాగేశ్వరిలు తెలిపారు. కార్యక్రమంలో శ్రమ ఉద్యోగులు రాజశేఖర్, దుర్గారావు, భవాని, రమణయ్య తదితరులు పాల్గొన్నారు


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పీడీ సత్యవాణి

రెవెన్యూ అంశాల పురోగతిపై దృష్టి సారించాలి

అమలాపురం రూరల్: రెవెన్యూ అంశాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యోగులను జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర అదనపు భూపరిపాలన ముఖ్య కమిషనర్ ఇంతియాజ్ వివిధ జిల్లాల సంయుక్త కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం డీఆర్వో సత్తిబాబు జిల్లాలోని వివిధ మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నిషిద్ధ జాబితాలో భూముల తొలగింపు, నిరుపేదలకు అసైన్డ్ భూముల ఇచ్చే ప్రక్రియ, వన్ టైం కన్వర్షన్, అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, సబ్‌డివిజన్ సమస్యలు, నీటి తీరువా వసూలు తదితర అంశాల్లో పురోగతి సాధించాలంటూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో భూసేకరణ సెక్షన్ సూపర్‌వైజర్లు, రమణకుమారి, పి.సుబ్రహ్మణ్యం, ఉప తహసీల్దార్ చినబాబు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీఆర్వో సత్తిబాబు తదితరులు